క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు



మున్సిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఫరూఖ్‌నగర్: జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకట్రామ్‌ను ఆయన కార్యాలయంలో శుక్రవారం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల అర్జున్, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి మిఠాయి తినిపించి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిద్దు, వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి



మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు

తుక్కుగూడ: దేశ ఐక్యత కోసం కేంద్ర మాజీ హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర నాయకుడు అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. గురువారం పుర పరిధిలోని రావిర్యాల గ్రామంలో సర్దార్ పటేల్ యువజన సంఘం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత, మాజీ చైర్మన్ కే.మధు మోహన్, కౌన్సిలర్లు వై.శివకుమార్, యాదగిరిరెడ్డి, సర్దార్ పటేల్ యువజన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు



కమిషనర్ వాణిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వాణిరెడ్డిని శుక్రవారం మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జానకీరామ్, కే.రాజ్‌కుమార్, యాదయ్య, సుందరయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు: ముదిరాజ్‌లను అన్ని విధాలా ఆదుకునేలా తమవంతు కృషి చేస్తున్నామని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పిట్టల పాండుముదిరాజ్, జిల్లా నాయకుడు కాకి దశరథముదిరాజ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తగూడలో మృతి చెందిన దీమల అనసూయ భౌతికకాయానికి నివాళులర్పించి ఆమె కుటుంబీకులకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. అందరూ కలిసికట్టుగా ఉంటూ అభివృద్ధి చెందేలా ఒకరికొకరు సహకరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం యూత్ అధ్యక్షుడు కొర్వి సురేందర్, సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీజేవైఎం నాయకులు

మొయినాబాద్: బీజేవైఎం నాయకులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం దీపావళి సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుండె గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు రాజమల్లేశ్, మొయినాబాద్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్లేశ్‌గౌడ్, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు హర్షనాయక్, నాయకులు జగపతి, శంకర్, శ్రావణ్, దినేశ్, రాజశేఖర్, కేశవ్ తదితరులు గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

- లాభసాటిగా ఆయిల్ పామ్ సాగు
- పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- భారీ రాయితీతో మొక్కలు, డ్రిప్పు పరికరాలు, ఎరువుల అందజేత



ఆయిల్ పామ్ మొక్క



మహేశ్వరంలో సాగు చేసిన ఆయిల్ పామ్‌ను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు (ఫైల్)

మహేశ్వరం: ఆయిల్ పామ్ సాగుపై రైతాంగం ఆసక్తి చూపుతోంది. ప్రభుత్వం ప్రోత్సాహంతో సంప్రదాయ పంటలకు స్వస్తిపలికి లాభాలు తెచ్చే వాటిని పండించడంపై దృష్టి సారిస్తున్నారు. మూడేళ్లు శ్రమిస్తే 30 ఏళ్ల పాటు లాభాలు రావడంతో ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపుతున్నారు. పెట్టుబడి తక్కువతో రాబడి ఎక్కువగా ఉండడం, ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు అందిస్తుండడం గమనార్హం.

ప్రభుత్వం సబ్సిడీ

ఆయిల్ పామ్ మొక్క ఒక్కటి రూ.200 ఉండగా రైతులకు 90 శాతం సబ్సిడీతో రూ.20లకే అందిస్తుంది. ఎకరానికి 57 మొక్కలు అవసరం ఉంటుంది. మొక్కల రాయితీలో ఎటువంటి పరిమితి లేదు. ఆయిల్ పామ్ రైతులకు డ్రిప్ రాయితీ 12.5 ఎకరాలకు పరిమితం చేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీపైన ప్రభుత్వం అందిస్తుంది. యూనిట్ ధరపై 12 శాతం జీఎస్టీని రైతులు చెల్లించాలి. ఓసీ, బీసీ రైతులకు 80–90 శాతం రాయితీ ఉంటుంది. ఆయిల్ పామ్ మొక్కలు నాటుకున్న రైతులకు ఎకరానికి రూ.42,00 చొప్పున 4 సంవత్సరాల పాటు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. నాలుగో సంవత్సరం నుంచి పంట దిగుబడి మొదలవుతుంది.

విస్తృతంగా ప్రచారం

యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామాల్లో రైతు వేదికల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు పంటల మార్పిడి విధానంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సంప్రదాయ పంటలు కాకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నారు. ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వం భారీగా సబ్సిడీ అందించడంతో అన్నివిధాలుగా ప్రోత్సహిస్తుందని ఉద్యానవన శాఖ అధికారులు వివరిస్తున్నారు.

అంతర పంటలకు అవకాశం

ఆయిల్ పామ్ సాగు చేసే వారు అదనపు ఆదాయాన్ని పొందేందుకు మంచి అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఆయిల్ పామ్ మొక్కల మధ్యలో కూరగాయలు, మక్కలు, వేరుశనగ, పత్తి, బొప్పాయి, సోయాబీన్, ఆకుకూరలు వేసుకొని ఆదాయాన్ని పొందవచ్చు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగేళ్ల తర్వాత దిగుబడి వస్తుంది. అప్పటి వరకు అంతర పంటలు పండిస్తూ ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

> **అధిక లాభాలు**
>
> మహేశ్వరం, కందుకూరు మండలాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనువైన నేలలున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొంది లాభాలు పొందవచ్చు. ఆయిల్ పామ్ సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం మొక్కలు, ఎరువులు, డ్రిప్పుపై సబ్సిడీ అందిస్తుంది. సుమారు 30 మంది రైతులు 250 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేసుకున్నారు.
>
> – సౌమ్య, ఉద్యానవనశాఖ అధికారి, మహేశ్వరం

ఘనంగా సదర్ సమ్మేళనం



ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న యాదవులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో యాదవులు ఘనంగా సదర్ సమ్మేళనం నిర్వహించారు. దున్నపోతులతో విన్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యులుగా ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు. బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేశ్, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, కొత్తకుర్మ సత్తయ్య, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్‌లు శ్రీధర్‌రెడ్డి, సునితశ్రీకాంత్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, ఇంద్రసేనా, నాయకులు, యాదవులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

మీర్‌పేట: మీర్‌పేటకు చెందిన 8వ తరగతి చదువుతున్న ఆశ్రితగౌడ్ హైదరాబాద్ అండర్–15 మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైంది. బీసీసీఐ ద్వారా జట్టుకు ఎంపిక కావడంతో లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలతలు శుక్రవారం ఆశ్రితగౌడ్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుతున్న ఆశ్రితగౌడ్ మహిళా జట్టుకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఆశ్రిత చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థిని అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆశ్రితగౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సహకారంతోనే ఈ స్థాయికి చేరుకున్నానని, కర్నాటక రాష్ట్రం శివమొగ్గలో నవంబరు 21 నుంచి 29వ తేదీవరకు క్రికెట్ ట్రోఫీ జరగనుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీన్ సతీశ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం.ఎల్.మరియన్ పాల్గొన్నారు.



ఆశ్రితగౌడ్‌ను సత్కరిస్తున్న చైర్మన్ బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



కందుకూరులో టపాసులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న చిన్నారులు



బడంగ్‌పేట్: మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా దీపావళి వేడుకలు

కందుకూరు: మండల పరిధిలో గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా అంతా ఇళ్ల ముంగిట దీపాలు పెట్టి టపాసులు కాల్చి సంతోషంగా గడిపారు. వ్యాపారస్తులు ప్రత్యేకంగా లక్ష్మీపూజలు చేశారు. మహిళలు నోములు నోచుకొని లక్ష్మీదేవికి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

పీసీసీ అధ్యక్షుడికి..

బడంగ్‌పేట్: దీపావళి పండుగను పురస్కరించుకొని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జెల్ల రమేశ్‌గౌడ్, నడింపల్లి వెంకటేశ్‌గౌడ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కొందుర్గు: సీసీ కెమెరాలు ఉండటంతో కొంతవరకు నేరాలను నియంత్రించడానికి అనుకూలంగా ఉంటుందని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లిలో శుక్రవారం ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ హాజరై మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉంటాయని, దొంగతనాలు చేయడానికి సహితం వెనుకడుగు వేస్తారన్నారు. ఏమైనా నేరాలు, దొంగతనాలు జరిగినా త్వరగా ఛేదించడానికి వీలుపడుతుందన్నారు. ఇందుకోసం దుకాణాల యజమానులు సొంతంగా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని ముఖ్య కూడలీల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నర్సయ్య

సర్వేకు ప్రజలు సహకరించాలి

- ఎంపీడీఓ శైలజ



మహేశ్వరం: కులగణన సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శైలజ



బడంగ్‌పేట్: కులగణనలో పాల్గొన్న కమిషనర్ సరస్వతి, సిబ్బంది

మహేశ్వరం: సామాజిక ఆర్థిక కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సామాజిక ఆర్థిక కులగణన సర్వేపై ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించి డోర్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి 18 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వే ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. మహేశ్వరం మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో కులగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సర్వేకు వచ్చిన అధికారులు అడిగిన ప్రశ్నలకు ప్రజలు సమాధానం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, కారోబార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాల సేకరణ

బడంగ్‌పేట్: ఇటీవల కులగణన కోసం శిక్షణ పూర్తి చేసుకున్న ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఇతరులు శుక్రవారం కుల గణన సర్వేల కోసం ప్రత్యక్ష కార్యక్రమాల్లోకి నడుం బిగించారు. అందులో భాగంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లోని రోమా–2లో మొదటగా కులగణన సర్వే ఇంటింటి సర్వే మొదలుపెట్టారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.సరస్వతి ఈ కార్యక్రమంలో ముఖ్యులుగా పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి లిస్ట్ ప్రకారం కులగణన నిర్వహిస్తున్నారు. అందుకు ప్రజలు, కాలనీవాసులు కూడా పూర్తి సహకారం అందిస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి, బిల్ కలెక్టర్ జంగయ్య, ఆర్పీలు స్వరూప, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇళ్ల సంఖ్య గుర్తింపు..

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టనుంది.ఈ నేపథ్యంలో శుక్రవారం మున్సిపాలిటీ వ్యాప్తంగా సిబ్బంది ఇళ్ల సంఖ్యను గుర్తించారు.ఒక ఇమ్యూనేటర్ 150 ఇళ్లను సర్వే చేయాలి. దీంతో ఇంటింటా తిరిగి నెంబర్లను కేటాయించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డి ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

చేవెళ్ల: కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని చేవెళ్ల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కామారెడ్డిలోని ఆయన నివాసంలో కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయను కలిసిన వారిలో చేవెళ్ల నియోజకవర్గ బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి, మండల నాయకులు త్రినేత్ర, ఆనంద్‌గౌడ్, జయసింహారెడ్డి, శ్రీతంరెడ్డి, సందీప్‌లు ఉన్నారు.

పోరాటంతోనే రాజ్యాధికారం సాధ్యం

డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేందర్



షాద్‌నగర్: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పోరాటాలతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం సాధ్యమని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాఘవేందర్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుపేదల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారం కోసం పార్టీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల హక్కుల సాధనకు పార్టీ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, భూమి, ఉపాధి, ఇళ్లు అనే ఐదు గ్యారంటీలను రూపొందించినట్లు తెలిపారు. ఈ ఐదు గ్యారంటీలతో అణగారిన వర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. పేదల రాజ్యాన్ని నిర్మించేందుకు, పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనం కార్యక్రమాన్ని ఈ నెల 5న ఆదిబట్లలోని కేబీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమ్మేళానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మంచాల భిక్షపతి, గంట్లవెల్లి రాకేశ్, మహ్మద్, నర్సింహ, లాలయ్య, చిల్కమర్రి రాజు, పెంటయ్య, నరేశ్, డప్పు నరేందర్, చెన్నయ్య, సంజీవ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీని విజయవంతం చేయండి

కేశంపేట: డీఎస్పీ మొదటి ప్లీనరీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ మహిపాల్ అన్నారు. ప్లీనరీ మొదటి వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని శుక్రవారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపు ఆదిబట్లలో కార్యకర్తల మహా సమ్మేళనం (ప్లీనరీ) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ పీడిత ప్రజానీకం కోసం పార్టీ పని చేస్తుందన్నారు. పార్టీ నిర్మాణం, సమీక్ష, భవిష్యత్ కార్యాచరణకు మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మల్లేశ్, రవి, శివ, శ్రీకాంత్, నందు, విష్ణు, తిరుపతి, రమేశ్, కుమార్, జానీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరించినా తీరు మారలే!

- గ్రామపాలనలో అధికారుల నిర్లక్ష్యం
- మురుగు కాల్వల పూడికతో రోడ్డుపైనే పారుతున్న వ్యర్థ జలాలు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



మినీ ట్యాంకు వద్ద పేరుకుపోయిన మురుగునీరు

షాద్‌నగర్‌రూరల్: గ్రామ పాలనలో అధికారుల నిర్లక్ష్యం.. పారిశుద్ధ్య నిర్వహణపై అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజల మురుగు సమస్యతో సతమతమవుతున్నారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సదరు పంచాయతీ కార్యదర్శి తేజస్వినిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసును జారీ చేశారు. డీపీఓ హెచ్చరించినా పంచాయతీ కార్యదర్శి తీరు మారలేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

చిన్నపాటి వర్షానికే..

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో అధికారులు పారిశుద్ధ్య పనులను చేపట్టడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శుక్రవారం కురిసిన చిన్నపాటి వర్షానికి అవి పూర్తిగా మురుగుతో నిండిపోయాయి. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కురిసిన వర్షానికి మురుగు కాల్వ పైప్‌లైన్ నిండిపోయింది. మురుగు నీరు ఇళ్ల మధ్యలో రోడ్డుపై ప్రవహించడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

అపరిశుభ్రంగా మినీ ట్యాంకుల నల్లాలు

గ్రామంలోని మినీ ట్యాంకులను అధికారులు, పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మినీ ట్యాంకుల వద్ద నాచు పేరుకుపోవడంతో నీళ్ల కోసం నల్లా వద్దకు వెళ్లినవారు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాస్థాయి అధికారులు హెచ్చరించినా పంచాయతీ కార్యదర్శి తీరులో మార్పు రాలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీరు

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కొందుర్గు: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కార్మికుల హక్కులను కాలరాస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య విమర్శించారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో పతకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1920లో ఏఐటీయూసీ యూనియన్ ఏర్పడిందన్నారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారితో పోరాటం చేసిన ఘనత ఈ యూనియన్‌దేనన్నారు. కార్యక్రమంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ సీపీఐ మండల కార్యదర్శులు బాగళ్ల నర్సింహ, వెంకటేశ్, నాయకులు జంగయ్య, రాములు, చంద్రయ్య, రషీద్, రాజు, సువర్ణ, మల్లేశ్ పాల్గొన్నారు.